

సైబర్‌వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. 8లో



ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం

ప్రభుత్వాస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం అందుతోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలో పీహెచ్‌సీకి శంకుస్థాపన, పశువైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. 9లో

దరఖాస్తుల గడువు పొడిగింపు

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ ఐటీఐ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని సంగారెడ్డి కన్వీనర్ రాజేశ్వరరావు అన్నారు. ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు పొడిగించామని పదో తరగతి ఉత్తర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాల కోసం https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.





ఓటు వజ్రాయుధం

ఐ ఓట్ ఫర్ ష్యూర్ నినాదంతో సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్‌లో శనివారం 5కే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. అనంతరం యువత, ప్రజలతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో అధికారులు, ఉద్యోగులు, యువకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. - సాక్షి, నెట్‌వర్క్

న్యూస్‌రీల్

కిక్ బాక్సింగ్ పోటీలకు ప్రణయ్‌కుమార్ ఎంపిక



ప్రణయ్‌కుమార్

హత్నూర(సంగారెడ్డి) : మండలంలోని షేరఖాన్ పల్లికి చెందిన కనిగెరి ప్రణయ్‌కుమార్ జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ అండర్ -18 విభాగ పోటీలకు ఎంపికయ్యాడని జిల్లా కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ పోచయ్య శనివారం తెలిపారు. ఈనెల 23 నుంచి రాంచిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కాగా ఆర్ట్స్ అకాడమీ నుంచి తమ స్టూడెంట్ ఎంపిక కావడంపై గ్రాండ్ మాస్టర్ లక్ష్మీనారాయణ, మాస్టర్ సందీప్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- ఎన్‌సీఈఆర్‌టీ సభ్యుడు మురళి మనోహర్‌రావు



జ్ఞాపికను అందజేస్తున్న మురళి మనోహర్‌రావు

జహీరాబాద్ టౌన్: నేటి సాంకేతిక ప్రపంచంలో విద్య ఎంతో అవసరమని, ప్రతిఒక్కరూ ఇష్టపడి చదవాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) జిల్లా సభ్యుడు మురళి మనోహర్‌రావు పేర్కొన్నారు. వివేకానంద సేవ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విద్యార్థుల అభినందన సభలో 250 మందికి జ్ఞాపికలు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జీవితాలపై చదువు ప్రభావం చూపుతోందన్నారు. ఆర్థిక పరిస్థితులను కూడా మార్చుతోందన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం మరింత బలపడుతోందన్నారు. కార్యక్రమంలో మల్లయ్యగిరి ఆశ్రమ పీఠాధిపతి బసవలింగ మహారాజ్, రాష్ట్రీయ బసవ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్, ఎంఈఓ బస్వరాజ్, వివేకానంద సేవ సమితి జిల్లా అధ్యక్షుడు ఆనందీశ్వర్, డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.


'మాకు న్యాయం చేయండి'



రిలే నిరాహార దీక్షలో కూర్చున్న బాధితులు

పటాన్‌చెరు : 'మాకు న్యాయం చేయండ'ని సాహితి ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బాధితులు కోరుతున్నారు. వారు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం 21వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కంపెనీ ఎండీ లక్ష్మీనారాయణ ఫ్లాట్‌లు కట్టిస్తామని నగదు వసూలు చేసుకొని మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమతోపాటు విశ్రాంత, ఐటీ ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబాల వారు డబ్బులు చెల్లించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరుతున్నారు.

10 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 10 మందికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అలాగే ఆర్టీపీసీఆర్ టెస్టులు 10 మందికి నిర్వహించినట్లు తెలిపారు.

అల్పపీడన ద్రోణితో వర్షాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో శనివారం పలు చోట్ల వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా చిరుజల్లులు పడుతున్నాయి. బెజ్జంకి మండలంలో 34.1 మి.మీ, అక్బర్‌పేట్-భూంపల్లి మండలంలో 33.3 మి.మీ, కోహెడ మండలంలో 25.8 మి.మీ, దుబ్బాక మండలంలో 22.9 మి.మీ, కుకునూరుపల్లి మండలంలో 22.1 మి.మీ, హుస్నాబాద్ మండలంలో 20.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 405.6 మి.మీ, సగటున 15.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

కాక్టస్.. క్రేజీ!





వినోద్‌కుమార్ నివాసంలో పెంచుతున్న కాక్టస్(ఎడారి) మొక్కలు

సండే స్పెషల్

ఎడారిమొక్కలపై క్రేజ్ పెరుగుతోంది. పట్టణాల్లోని చాలా మంది తమ ఇంటి ముంగిట కుండీల్లో పెంచుకుంటున్నారు. పలు రకాల ఎడారి మొక్కలు చూడముచ్చటగా.. అందంగా కనిపిస్తుండటంతో పెంచుకునేందుకు పర్యావరణ ప్రియులు ఆసక్తి చూపుతున్నారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన మఠం వినోద్‌కుమార్ ఏకంగా 200 రకాల ఎడారి మొక్కలను ఇంటి ఆవరణలో పెంచుతుండటం విశేషం. అంతేకాదు ఇతరులకు మార్గదర్శనం చేస్తున్నారు.

- ఎడారి మొక్కలకు పెరుగుతున్న ఆదరణ
- ఆకట్టుకుంటున్న విభిన్న ఆకృతులు..
- కుండీల్లో పెంచుకుంటున్న పర్యావరణ ప్రియులు
- 200 రకాల మొక్కలు పెంచుతున్న వినోద్‌కుమార్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : సైప్రాస్.. సక్‌క్లాంట్.. ఎక్టోపిక్.. మమ్మిల్లారియా.. ఎంలోస్‌గటా.. ఇవన్నీ ఎడారుల్లో పెరిగే అరుదైన మొక్కలు. మారుతున్న అభిరుచుల మేరకు ఇలాంటి అరుదైన ఎడారి మొక్క (కాక్టస్)లను ఇప్పుడు ఇంట్లోనే పెంచుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు బ్రహ్మజెముడు, నాగజెముడు వంటి ముళ్ల జాతి మొక్కలను ఇంటి ఆవరణలోనే పెంచుకునే వారు కాదు. ఇప్పుడు మారుతున్న అభిరుచుల మేరకు విభిన్న ఆకృతుల్లో ఉండే ఈ మొక్కలను ఇంట్లో పెంచుకుంటున్నారు. నగరాల్లో అక్కడక్కడ అరుదుగా నాలుగైదు రకాల ఏడారి మొక్కలు కనిపిస్తుంటాయి. ఏకంగా 200లకు పైగా రకాల ఎడారి మొక్కలను ఇంట్లో పెంచడమే హాబీగా పెట్టుకున్నారు సంగారెడ్డికి చెందిన మఠం వినోద్‌కుమార్. పంచాయతీరాజ్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి అయిన ఆయన తనకున్న కొద్ది పాటి ఆవరణలోనే ఈ మొక్కలు పెంచుతున్నారు.

ఎక్కువ రోజులు నీళ్లు లేకున్నా..

ఎడారి మొక్కలు సుమారు నెలరోజులపాటు నీళ్లు పోయనప్పటికీ తట్టుకునే శక్తి ఉంటుంది. ఒక్కసారి నీళ్లు పోస్తే వారం రోజులపాటు వాటి వైపు చూడాల్సిన అవసరం లేదని వినోద్ కుమార్ అంటున్నారు. పైగా ఈ మొక్కలతో ఆకులు, అలం, చెత్త తయారు కాదు.

చూడ ముచ్చటగా

ఈ ఏడారి మొక్కలు ఇంట్లో కుండీల్లో పెట్టుకుంటే చూడముచ్చటగా కనిపిస్తుంటాయి. వినూత్న ఆకృతుల్లో ఉండే ఈ మొక్కలు ఇంటి అందాన్ని మరింత పెంచుతున్నాయి. దీంతో ఇంట్లో పెట్టుకునే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. పూర్తిగా ముళ్లతో కూడిన వీటిని చూడటానికి వినూత్నంగా కనిపిస్తుండటంతో హాలు, డైనింగ్ టేబుల్, ఆఫీస్‌రూంలో టేబుళ్లపై పెట్టుకుంటున్నారు. స్థలాన్ని కూడా పెద్దగా ఆక్రమించకపోవడంతో ఇంట్లో పెంచుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. కొన్ని రకాల మొక్కలు చక్కటి పూలు కూడా పూస్తున్నాయి.

సోషల్ మీడియాలో గ్రూపులుగా ఉన్నాం



కాక్టస్ మొక్కలు పెంచుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వినూత్న ఆకృతుల్లో ఉండటంతో వీటిని ఎక్కువగా పెంచుకుంటున్నారు. వీటిని పెంచడం కూడా ఎంతో సులభం. కాక్టస్ మొక్కలు పెంచే వారంతా సోషల్ మీడియాలో గ్రూపులుగా ఉన్నాం. ఎవరివద్దనైనా అరుదైన మొక్క ఉంటే విత్తనాలు తెప్పించుకుంటున్నాం. – మఠం వినోద్‌కుమార్

రేపు మద్యంషాపుల లక్కీ డ్రా

- జిల్లాలో 101 దుకాణాలకు 6,156 దరఖాస్తులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లాలోని వైన్ షాపుల టెండర్ల లక్కీ డ్రా సోమవారం ఉదయం 11గంటలకు జేజేఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తారు. సాయంత్రం వరకు అన్ని షాపులు ఎవరి ఖాతాల్లో పడతాయో తేలనుంది. జిల్లాలోని 101 దుకాణాలకు సంగారెడ్డిలో 1,480 దరఖాస్తులు, పటాన్‌చెరు పరిధిలో 2646, జహీరాబాద్‌లో 942, నారాయణఖేడ్‌లో 621, అందోల్‌లో 467 దరఖాస్తులు రాగా.. మొత్తంగా 6,156 వచ్చాయి. అత్యధికంగా అమీన్‌పూర్ షాపునకు 161, అత్యల్పంగా సింగూర్ షాపునకు 22 దరఖాస్తులు వచ్చాయి.

అందరికీ అందుబాటులో చిరుధాన్య విక్రయశాలలు



విక్రయశాలను ప్రారంభిస్తున్న దృశ్యం

కోహీర్(జహీరాబాద్): చిరుధాన్యాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఉత్పత్తుల విక్రయశాలలను విస్తరిస్తున్నామని డీడీఎస్ ప్రతినిధి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని బిలాల్‌పూర్‌లో శనివారం డీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల విక్రయశాలను సర్పంచ్ నర్సింహులు ప్రారంభించారు. ఇందులో కొర్రలు, సామలు, సజ్జలు, తైదలు, యవ్వలు, అరికెలు, ఊదలు, పచ్చ జొన్నలు, తెల్లజొన్నలు తదితర 16 వ్యవసాయ ఉత్పత్తులు విక్రయానికి అందుబాటులో ఉంటాయన్నారు. కట్టె గానుగాడించిన కుసుమల నూనెను సైతం విక్రయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, సర్పంచ్ నర్సింహులు, ఎంపీటీసీ అనిల్ కుమార్, డీడీఎస్ అధికారులు బాలయ్య, మాణిక్యం, చుక్కమ్మ పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం



కొండాపూర్ : మాట్లాడుతున్న మాణిక్యం

కొండాపూర్(సంగారెడ్డి): గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు సర్వీసు నుంచి తొలగించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అమానుషమన్నారు. ఆమె వద్ద డబ్బులు గుంజుకున్నారని, కూతురు పెళ్లి పత్రిక చూపించిన పెడచెవిన పెట్టడం బాధాకరమన్నారు. ఈ అమానవీయ చర్యను కేవీపీఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మహిళను రాత్రంతా ఏ చట్టం ప్రకారం స్టేషన్‌లో ఉంచారు? పోలీసులు చెప్పాలని అన్నారు. బాధ్యులైన ఇద్దరు పోలీసులను ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరు శివకుమార్, సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు దాస్, దత్తు, నాయకులు శ్రీకాంత్, రజనీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలి

నారాయణఖేడ్: గిరిజన మహిళపై హైదరాబాద్‌లో పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమని, ఎస్ఐతోపాటు సిబ్బందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్ రాథోడ్ డిమాండ్ చేశారు. స్థానికంగా శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్ నాయక్, ఉపాధ్యక్షుడు రమావత్ సురేష్, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, నాయకులు వినోద్ రాథోడ్, రవినాయక్, శంకర్‌నాయక్, నగేష్ పాల్గొన్నారు.

9న జాతీయ లోక్‌అదాలత్

సంగారెడ్డి టౌన్ : సెప్టెంబర్ 9న జాతీయ లాక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు జడ్జి రాధాకృష్ణ చౌహాన్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టులో బ్యాంక్, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్స్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ అధికారులు లోక్ అదాలత్ ద్వారా మొండి బకాయిలను చెల్లించుకోవచ్చన్నారు. కక్షిదారులకు నోటీసులు పంపిస్తామని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి రాధాకృష్ణ చౌహాన్



మల్లన్న సాగర్ వద్ద నాబార్డు అధికారులు

మల్లన్న సాగర్ సూపర్

తొగుట(దుబ్బాక): శ్రీ కొమురవెల్లి మల్లన్న సాగర్‌ను 40 మంది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నాబార్డు రీజినల్ అధికారులు శనివారం సందర్శించారు. తుక్కాపూర్ శివారులోని పంప్‌హౌస్‌ను పరిశీలించారు. గోదావరి జలాల ఎత్తిపోత విధానాన్ని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకతను నీటి పారుదల శాఖ అధికారులు వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్‌ఈ వేణు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న, కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్లు

- అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలి
- కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్ : అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లతో కలిసి హరితహారం, స్పౌజ్‌కు ఆసరా పింఛన్ మంజూరు, గృహలక్ష్మి, ఇంటి పట్టాల పంపిణీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా జిల్లా కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు ఈనెల 22లోగా గుంతల తవ్వకం పూర్తి కావాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల్లో గుర్తించిన స్థలాల్లో గుంతలు తీయించి సిద్ధంగా ఉండాలని, ఎవెన్యూ ప్లాంటేషన్ గ్యాప్స్ ఫిల్లింగ్ చేయాలని, లేఅవుట్ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. జిల్లాలో సంపద వనాలు, హరిత హారం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. గృహలక్ష్మి పథకం దరఖాస్తులు క్షేత్రస్థాయి పరిశీలన ఈనెల 23లోగా పూర్తి చేయాలని సూచించారు. ఇంటి పట్టాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, 29 గ్రామాలలో భూమిని గుర్తించామని, లబ్ధిదారులను గుర్తించి లేఅవుట్ చేసి పంపిణీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.

ఫొటో ఓ మధుర స్మృతి

ఫొటో ఒక మధుర స్మృతి అని, గత జ్ఞాపకాలకు తీపి గుర్తు అని కలెక్టర్ శరత్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఫొటోగ్రఫీ డే కార్యక్రమంలో ఆయన, చింతా ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చాయా చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక్క ఫొటో అనేక భావాలను పలికిస్తోందన్నారు. ఫొటోగ్రాఫర్లు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అంతకు ముందు చిత్ర ప్రదర్శనను అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు తిలకించారు. తొలుత ఫొటోగ్రాఫర్లను శరత్, ప్రభాకర్ సన్మానించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ శరత్ అన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం ఐ ఓట్ ఫర్ ష్యూర్ నినాదంతో ఓటరు అవగాహన 5కే ర్యాలీని జెండాఊపీ కలెక్టర్ నిర్వహించారు. మహబూబ్ సాగర్ చెరువు వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ జరిగింది. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో అందరితో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ప్రతిజ్ఞ చేయించారు.

క్లుప్తంగా

విద్యార్థులకు బాసటగా సర్కార్



మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణ

వర్గల్(గజ్వేల్): తల్లిదండ్రుల భాగస్వామ్యం పాఠశాలల ప్రగతి, విద్యాభివృద్ధికి దోహద పడుతుందని విద్యాశాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన వర్గల్ మండలం తున్కిఖాల్సా, బొర్రగూడెం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో పాల్గొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకం అన్నారు. విద్యార్థులకు వినూత్న విద్యా బోధన, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, స్కూల్ యూనిఫాం ఉచితంగా అందిస్తూ ప్రభుత్వం బాసటగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా పాజిటివ్ పేరెంటింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి భాస్కర్, హెచ్‌ఎం నాగరాజు, భాగ్యలక్ష్మి, సంధ్యాజాని, నర్సింలు, రాజనరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్): ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం(ఎస్‌కెఎల్‌టీఎస్‌హెచ్‌యూ) తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ(టీఎన్‌ఏయు)ల మధ్య కోయంబత్తూరులో ఈనెల 17న పరస్పర సహకార అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ములుగు విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి.నీరజప్రభాకర్, తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ గీతలక్ష్మి విల్లింగిరిలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ములుగు విశ్వవిద్యాలయ వీసీ నీరజ ప్రభాకర్ మాట్లాడుతూ.. శాస్త్రీయ సమాచార మార్పిడి, విద్య, పరిశోధన, విస్తరణ రంగాలలో నిర్దిష్ట సహకార కార్యక్రమాలు, ప్రాజెక్ట్‌లను అభివృద్ధి చేయడంలో అనుసంధానాలను కలిగి ఉండటం, సంబంధిత సంస్థల యొక్క శాస్త్రీయ, సాంకేతిక విభాగాలతో సంబంధాన్ని ఏర్పరుచుకోవడం ఈ ఒప్పందం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీల అధికారులు కిరణ్‌కుమార్, వేతమన్, తమిజ్‌వందన్ పాల్గొన్నారు.

కన్నతండ్రే కాలయముడై..

- భార్యపై కోపంతో కూతురిని చంపిన తండ్రి
- స్కూలు నుంచి తీసుకెళ్లి.. బ్లేడ్‌తో గొంతు కోసిన వైనం
- రక్తపు మడుగులో విలవిల్లాడిన చిన్నారి
- నిర్మానుష్య ప్రదేశంలో మృతదేహాన్ని పడేసేందుకు యత్నం
- ఓఆర్‌ఆర్‌పై తిరుగుతూ.. పోలీసులకు చిక్కిన నిందితుడు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ భీంరెడ్డి

హస్తినాపురం/అబ్దుల్లాపూర్‌మెట్: కన్న తండ్రే కాలయముడయ్యాడు. భార్యపై ఉన్న కోపంతో సొంత కూతురినే హతమార్చాడు. చదువుకునేందుకు స్కూలుకు వెళ్లిన చిన్నారిని..కారులో ఎక్కించి వెంట తెచ్చిన బ్లేడుతో గొంతు కోశాడు. బీహెచ్‌ఈఎల్ పరిధిలో చోటు చేసుకున్న ఈ అమానవీయ ఘటన శనివారం అబ్దుల్లాపూర్ మెట్ పరిధిలో వెలుగు చూసింది. కన్నపేగు తెంచుకు పుట్టిన బిడ్డ కళ్లముందు విగతజీవిగా కన్పించడంతో ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది.

మూడేళ్ల క్రితం అమెరికా నుంచి వచ్చి..

చందానగర్‌కు చెందిన చంద్రశేఖర్(40)కి బీహెచ్‌ఈఎల్‌కు చెందిన హిమబిందుతో 2011లో వివాహమైంది. ఇద్దరు కొంత కాలం అమెరికాలో ఉన్నారు. వీరికి ఎనిమిదేళ్ల కుమార్తె మోక్షజ ఉంది. మూడేళ్ల క్రితం వీరు అమెరికా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. అప్పటికే వీరిద్దరి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. దీంతో ఇరువురు వేర్వేరుగా ఉంటున్నారు. హిమబిందు తన కుమార్తె మోక్షజతో కలిసి బీహెచ్‌ఈఎల్‌లోని తన తల్లిగారి ఇంట్లో ఉంటుంది. స్థానికంగా ఉన్న జ్యోతి విద్యాలయంలో కుమార్తెను నాలుగో తరగతి చదివిస్తుంది. చంద్రశేఖర్ చందానగర్‌లో ఒంటరిగా ఉంటున్నాడు. కూతురు చదువుతున్న స్కూలుకు ఆయన అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్లేవాడు. భార్యతో నెలకొన్న విభేదాలతో ఇటీవల ఓ సైకోలా మారాడు.

వారం రోజుల క్రితమే పన్నాగం

ఎలాగైనా తల్లీకూతుళ్లను హతమార్చాలని చంద్రశేఖర్ పన్నాగం పన్నాడు. ఆ మేరకు వారం రోజుల క్రితం చందానగర్‌లో పదునైన పెన్సిల్‌చాకుతో పాటు పేపర్ కట్టర్ కత్తి(బ్లేడ్)ని కొనుగోలు చేసి కారులో పెట్టుకున్నాడు. అదును కోసం ఎదురు చూశాడు. శుక్రవారం మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో తన కూతురు చదువుతున్న స్కూల్‌కు వెళ్లి..ఆమెను బయటికి తీసుకొచ్చాడు. కారులో ఎక్కించుకుని



మృతురాలు మోక్షజ (ఫైల్)

వెంట తెచ్చుకున్న పదునైన బ్లేడ్‌తో గొంతుకోసి హత్య చేశాడు. చిన్నారి మోక్షజ రక్తపు మడుగులో గిలగిల కొట్టుకుని ప్రాణాలను వదిలిపెట్టింది. మృతదేహాన్ని నిర్మానుష్య ప్రదేశంలో పడేసేందుకు యత్నించాడు. మృతదేహాన్ని కారులో ఉంచి రాత్రి 10.30 గంటల సమయంలో కోహెడ శివారుకు చేరుకున్నాడు. ఔటర్‌పై అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పాటు ఆయన ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. మృతదేహాన్ని తరలిస్తున్న కారుకు ముందు భాగంలోనే మరో కారు టైర్ పేలడంతో నిలిచిపోయింది. వారు కారును నిలిపి టైరుమా



హంతకుడు చంద్రశేఖర్ (ఫైల్)

రుస్తుండగా...అటువైపు వచ్చిన చంద్రశేఖర్ మీద అనుమానం వచ్చింది. (ఏపీ28డీడబ్ల్యు4667) వెనుక సీటులో 8 ఏళ్ల ఓ బాలిక అతి కిరాతకంగా హత్యకు గురై ఉండటం, కారులోంచి రక్తం కారుతుండటాన్ని చూసి వెంటనే వారు డయల్ 100కి సమాచారం అందజేశారు.

నిందితుడు అరెస్ట్..రిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారును పరిశీలించగా కారు డిక్కీలో బాలిక మృతదేహం లభించింది. నిందితుడు చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. భార్యపై కోపంతోనే తాను బిడ్డను చంపాల్సి వచ్చిందని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ భీంరెడ్డి శనివారం వనస్థలిపురం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్, కరుణాకర్‌రెడ్డిలు ఉన్నారు.

బీహెచ్‌ఈఎల్‌లో విషాదం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కాలనీలోని జ్యోతి విద్యాలయ పాఠశాలలో చదువుతున్న 4వ తరగతి విద్యార్థి మోక్షజ హత్య శనివారం స్థానికంగా సంచలనం రేపింది. మృతురాలు మోక్షజ తన తల్లి హిమబిందుతో కలిసి భారతీనగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఐజీ కాలనీలో నివాసం ఉంటోంది. కాగా హిమబిందు ఆమె భర్త చంద్రశేఖర్‌లు కొంతకాలంగా వేర్వేరుగా ఉంటున్నారని స్థానికులు తెలిపారు. చంద్రశేఖర్ అప్పుడప్పుడు తన కూతుర్ని చూసుకునేందుకు హెచ్‌ఐజీ కాలనీకి వచ్చేవాడని, మోక్షజతో రోడ్డుపైన మాట్లాడి వెళ్లేవాడని ఆ వీధిలో నివసించే వారు తెలిపారు. శుక్రవారం సాయంత్రం చిన్నారిని స్కూల్ నుంచి కారులో తీసుకువెళ్లిన తండ్రి చంద్రశేఖర్ కర్కశంగా మారి కూతురు హత్య చేయడంతో స్థానికంగా విషాదం అలుముకుంది.

ఫారిన్ లొకేషన్‌లా 'రంగనాయక సాగర్'



మసూద్ అలీకి మొక్క అందజేస్తున్న అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రంగనాయక సాగర్ రిజర్వాయర్, నర్సరీలో మొక్కల పెంపకాన్ని శనివారం వరంగల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ అలీ, రీజినల్ పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ శ్రీనివాస్ పరిశీలించారు. నర్సరీ మొక్కలను పట్టణ పచ్చదనం కోసం వాడటం బాగుందన్నారు. గెస్ట్ హౌస్ నుంచి రంగనాయక సాగర్‌ను చూస్తే ఫారిన్ లొకేషన్‌లా కనిపిస్తుందన్నారు. ఈ ప్రాంతం పెద్ద పర్యాటకంగా మారుతుందన్నారు. రిజర్వాయర్ వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సిద్దిపేటను అభివృద్ధి చేస్తున్న మంత్రి హరీశ్‌రావును అభినందించారు. హరితహారం అధికారి ఐలయ్య, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ మహేష్ పాల్గొన్నారు. అనంతరం బుస్సాపూర్‌లోని బయోమైనింగ్, బయోసీఎన్‌జీ గ్యాస్‌ప్లాంట్, కార్బన్ మాస్టర్స్ వారు చేస్తున్న సేంద్రియ ఎరువు తయారి విధానాన్ని పరిశీలించారు.

విద్యుదాఘాతంతో మేకలు మృతి

హుస్నాబాద్‌రూరల్: విద్యుదాఘాతంతో మేకలు మృత్యువాత పడిన సంఘటన శనివారం మండల పరిధిలోని పోతారం(ఎస్)లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో వైన్స్ ఎదుట ఉన్న మిల్లుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌కు విద్యుత్ సరఫరా అయ్యింది. అక్కడికి మేత కోసం వెళ్లిన రెండు మేకలకు షాక్ తగలడంతో చనిపోయాయి. రూ.20వేలు నష్టం జరిగిందని బాధితుడు కత్తుల మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయకపోవడంతోనే మేకలు బలయ్యాయని తెలిపాడు.

తనయుడికి తలకొరివి పెట్టిన తల్లి

- కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగిన యువకుడు
- చికిత్స పొందుతూ మృతి



కొడుకు అంత్యక్రియల్లో తల్లి



కోటేశ్వర్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): వృద్ధాప్యంలో ఏ తల్లిదండ్రులైనా తన కొడుకుల చేత తలకొరివి పెట్టించుకోవాలని కోరుకుంటారు. కానీ, తనయుడికే అంత్యక్రియలు నిర్వహించాల్సి రావడం పలువురి మనసులను కలచివేసింది. ఈ సంఘటన మండలకేంద్రం మిరుదొడ్డిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్, గ్రామస్తులు శనివారం తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన గొట్టం లింగం–లలిత దంపతులకు ఇద్దరు కొడుకులు కుమార్, కోటేశ్వర్(28)లు ఉన్నారు. పెద్ద కొడుకు కుమార్ భార్యా పిల్లలతో ఉంటున్నాడు. అవివాహితుడైన చిన్న కొడుకు కోటేశ్వర్ గ్రామ పంచాయతీలో వాటర్‌మెన్‌గా పని చేస్తున్నాడు. తండ్రి ఐదేళ్లక్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కోటేశ్వర్ కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా ఫలితం లేదు. దీనికి తోడు కుటుంబ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన కోటేశ్వర్ ఈ నెల 17న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా అన్నకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వెంటనే కుటుంబ సభ్యులు కోటేశ్వర్‌ను సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కోటేశ్వర్ అవివాహితుడు కావడం, తండ్రి చనిపోవడంతో తల్లి తలకొరివి పెట్టింది.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- 5.33లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్‌ల కోసం సెర్చ్ చేయగా ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.5 లక్షల 33 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు శివారులోని కృషి డిఫెన్స్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ జూలై 22వ తేదీన పార్ట్‌టైం జాబ్ కోసం సెర్చ్ చేస్తుండగా తన వాట్సాప్‌కు ఓ మెసేజ్ వచ్చింది. దానికి స్పందించి వివరాలు నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ముందుగా టాస్క్ ఇచ్చి బాధితుడి ఖాతాలో 150 రూపాయలు వేశారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.5 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు పూర్తి చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు పలు దఫాలుగా రూ.5 లక్షల 33 వేలు వేశాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వ్యాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగిన మైకంలో ఆత్మహత్య



దుర్గయ్య(ఫైల్)

హవేళీఘనపూర్(మెదక్): తాగిన మైకంలో ఓ వ్యక్తి ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం మెదక్ మండలం పేరూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికిచెందిన చింతకింది దుర్గయ్య(52) మద్యంకు బానిసై పని చేయకుండా ఇంట్లో గొడవ పడుతూ ఉండేవాడు. శుక్రవారం మద్యం సేవించి ఇంట్లోవాళ్లతో ఘర్షణ పడి అందరు నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. తీవ్రగాయాలైన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మెదక్‌రూరల్ ఎస్‌ఐ అమర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుని భార్య సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు.

అప్పుడు తల్లి.. ఇప్పుడు తండ్రి

- అనాథలైన ముగ్గురు చిన్నారులు
- ఆదుకోవాలని గ్రామస్తుల వేడుకోలు



రోదిస్తున్న చిన్నారులు

రాయపోలు(దుబ్బాక): తల్లిదండ్రుల మృతితో ఆ పిల్లలను రోడ్డున పడేశాయి. అనారోగ్యంతో రెండేళ్ల కిందట తల్లి చనిపోగా.. అదే అనారోగ్యం తండ్రినీ పొట్టనపెట్టుకుంది. దీంతో ముగ్గురు చిన్నారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాలకు చెందిన దొడ్డి యాదగిరి (42), రేణుక (35)లకు ముగ్గురు ఆడపిల్లలు. 2021లో రేణుక అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి పిల్లల బాగోగులు తండ్రి చూసుకునేవాడు. అంతలోనే యాదగిరి తల్లి బాల ఎల్లవ్వ కూడా మృతిచెందింది. కాగా కొద్ది రోజులుగా యాదగిరి కూడా మంచం పట్టాడు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 18న మృతిచెందాడు. శనివారం గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. తల్లిదండ్రులతో పాటు నానమ్మ కూడా మృతిచెందడంతో చిన్నారులు అనాథలయ్యారు. శిరీష 8వ తరగతి, శ్రావణి నాలుగు, రిషిక రెండో తరగతి చదువుతున్నారు. పిల్లల రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. ఎవరూ లేని ఈ పిల్లలను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దాతలు సాయం అందించాలనుకుంటే 9550940672లో సంప్రదించాలని తెలిపారు.

ఉద్యోగం రాదేమోనన్న బెంగతో..

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి



వినయ్ (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): ఉద్యోగం రాదేమోనన్న బెంగతో యువకుడు ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన శనివారం మండలంలోని చిలాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన తిప్పిరిశెట్టి వినయ్(20) తండ్రి శ్రీనివాస్ ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లాడు. తల్లి మానసిక స్థితి సరిగా లేక అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటుంది. వినయ్ నానమ్మతో కలిసి చిలాపూర్‌లో ఉంటూ డిగ్రీ పూర్తి చేసి ఆర్మీ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. గత ప్రయత్నంలో ఉద్యోగానికి సెలక్ట్ కాకపోవడంతో కోచింగ్ తీసుకుంటున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చి ఈసారి కూడా ఉద్యోగం వస్తదో రాదోనని నానమ్మ కనుకమ్మతో చెప్పి బాధపడ్డాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. గమనించిన బంధువులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం వినయ్ మృతి చెందాడు. మృతుని తల్లి మానసిక స్థితి సరిగా లేకపోవడం, తండ్రి శ్రీనివాస్ దుబాయ్‌లో ఉండటంతో బాబాయి రవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎల్లయ్య తెలిపారు.

పిల్లలు లేరని చిన్నారి కిడ్నాప్

- 24గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- తల్లిదండ్రుల చెంతకు చిన్నారి



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్ కుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ: పిల్లలు లేరనే బాధతో ఆరు నెలల పాపను ఎత్తుకెళ్లిన సంఘటన సంగారెడ్డిలో జరిగింది. చిన్నారిని కిడ్నాప్ చేసిన నిందితుడిని 24గంటల్లో పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు డీఎస్పీ రమేష్ కుమార్ శనివారం వెల్లడించారు. మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన దంపతులు వల్లేపు రాజు, యేసుమని తమ ఇద్దరు పిల్లలతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి చెకప్ కోసం తరచూ వస్తుండేవారు. శుక్రవారం ఆస్పత్రికి వచ్చిన వారు రాత్రి పాత బస్టాండ్ సమీపంలోని గంజి మైదాకు వెళ్లి అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో నిద్రించారు. ఆ పక్కనే గద్దెపై పట్టణానికి చెందిన మన్నే అనిల్, అతని స్నేహితుడు శ్రీశైలం మద్యం సేవిస్తున్నారు. అయితే అనిల్‌కు పెళ్లయ్యి ఏడేళ్లవుతున్నా పిల్లలు లేరనే బాధతో పక్కనే నిద్రిస్తున్న చిన్నారి రూపని తన స్నేహితుడి సహాయంతో ఎత్తుకెళ్లాడు. తెల్లారి నిద్రలేచే సరికి పాప కనిపించకపోవడంతో దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని పట్టుకొని పాపను తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించగా, అతని స్నేహితుడు శ్రీశైలం పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. కిడ్నాప్ కేసును చాకచక్యంగా ఛేదించిన పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి, రూరల్ సీఐ సుధీర్ కుమార్, ఇన్‌స్పెక్టర్ మహేష్‌లను అభినందించారు. అలాగే మరో ముగ్గురు కానిస్టేబుళ్లు శాబీర్, మల్లారెడ్డి, శేఖర్‌కు నగదు పురస్కారం అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో శనివారం జరిగింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన తపస్ బిశ్వాస్(55) జీవనోపాధి కోసం 6నెలల క్రితం తెల్లాపూర్‌కు వలస వచ్చాడు. మై హోమ్ లేబర్ అడ్డాలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి బిశ్వాస్ తన గదిలో పడుకున్నాడు. శనివారం ఉదయం తోటి కూలీలు అతన్ని లేపినా లేవలేదు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఇస్లాంపూర్‌లో ..

తూప్రాన్: అనుమానాస్పద స్థితిలో కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇస్లాంపూర్‌లో శనివారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన ఆవుసుల(దాసోజి) నాగరాజు(36) అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. భార్య స్వరూప వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని పైడి కుంటలో శవమై కనిపించాడు. ఎవరైనా చంపి పడేశారా అని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.



చెరువులో క్రీడామైదానమా?

హత్నూర (సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామంలో తెలంగాణ క్రీడా మైదానం ఏర్పాటు చేయగా క్షేత్రస్థాయిలో అధికారుల అవగాహన లోపంతో చెరువు కుంటల్లో క్రీడామైదానాలు ఏర్పాటు చేశారు. హత్నూర మండలం రెడ్డగూడలో చెరువు కుంటలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానం వర్షపు నీటిలో ఉండడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని విద్యుత్ నగర్ కాలనీలో ఉన్న గణేష్ మండపంలో చోరీకి యత్నించిన వ్యక్తిని పట్టుకుని కాలనీ వాసులు దేహశుద్ధి చేశారు. గుర్తుతెలియని దుండగుడు మండపానికి వేసిన తాళం పగులకొట్టి లోపలికి చొరబడి చోరీకి ప్రయత్నించాడు. గమనించిన కాలనీ వాసులు అతన్ని పట్టుకొని దేహశుద్ధి చేసి జహీరాబాద్ పోలీసులకు అప్పగించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జహీరాబాద్ టౌన్: ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో జహీరాబాద్ పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. పట్టణంలోని డ్రైవర్ కాలనీకి చెందిన మోహినొద్దీన్ ఇంటిలో కొంతమంది కలిసి పేకాటాడుతున్నారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్ ఇంటిపై దాడి చేశారు. ఎనిమిది మంది పేకాటరాయుళ్లను పట్టుకుని వారి వద్ద రూ.4,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఘనంగా 'ఈశా' గ్రామోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో నాగేందర్

గజ్వేల్‌రూరల్: 'ఈశా' ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు జరుగుతున్న 15వ గ్రామోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. పట్టణంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని డీవైఎస్‌వో నాగేందర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పట్టణీకరణ వల్ల మరుగున పడుతున్న గ్రామీణ జీవన విధానాన్ని, అక్కడి ప్రత్యేక సంప్రదాయాలకు ఈశా గ్రామోత్సవం ప్రాముఖ్యతనిస్తుందన్నారు. గ్రామీణ ఆటలు, కళ, నృత్యం, నాటకం, సంగీతం వంటి విలక్షణమైన స్థానిక గ్రామీణ దేశ సంస్కృతులను ప్రదర్శించేందుకు రూపొందించడం జరిగిందన్నారు. ఈ గ్రామోత్సవంలో పురుషులు, మహిళల విభాగంలో వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మొదటి రోజు వాలీబాల్ ఆటను కార్యదర్శి రవీందర్‌రెడ్డి ప్రారంభించారు.